నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జవహర్‌నగర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. 11కేవీ లక్ష్మీనర్సింహా ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చెన్నాపురం, లక్ష్మీనగర్ కట్టా, నెహ్రూనగర్, శివాజీనగర్, జయశంకర్‌కాలనీ, లెప్రసీ కాలనీ, మదర్ థెరిస్సా కాలనీ, సిటిజన్స్ కాలనీ, శాంతినగర్, మూడుగుళ్లు, చిలకల బిల్డింగ్, రేణుకాఎల్లమ్మ దేవాలయం, ఆదర్శనగర్, వికలాంగుల కాలనీ, జేఎస్ఎన్‌యూఆర్ఎంనగర్, డబుల్ బెడ్రూమ్ బిల్డింగ్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాంబశివరావు ప్రకటించారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు



మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్ రోడ్డులో ఆక్రమణలను మున్సిపల్ అధికారులు పోలీసుల భద్రత మధ్య తొలగించారు. చౌరస్తా వద్ద రోడ్డు పక్కన, దుకాణాల ముందు అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్లు , చిన్న డబ్బాలను ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసుల పహారా మధ్య కూల్చివేశారు.

'మిస్ యూనివర్స్ తెలంగాణ'కు సత్కారం

మేడ్చల్‌రూరల్: మిస్ యూనివర్స్ తెలంగాణ-2025 విజేత కష్వీచౌడను సీఎంఆర్ మెడికల్ కళాశాల యాజమాన్యం బుధవారం సత్కరించింది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ మెడికల్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న కష్వీచౌడ ఇటీవల జరిగిన మిస్ యూనివర్స్ తెలంగాణ పోటీల్లో పాల్గొని క్రౌన్ మెడల్ సొంతం చేసుకుంది. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు ఆమెను సత్కరించి అభినందించారు. కళాశాల సెక్రటరీ వసంతలత, డీన్ వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు చెందిన గొల్లపల్లి లతకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు. అర్హులైన వారు సీఎం రిలీఫ్‌ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

షూటింగ్‌లో గురుకుల విద్యార్థిని ప్రతిభ



కీసర: తెలంగాణ రాష్ట్ర షూటింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీలు గచ్చిబౌలిలో నిర్వహించారు. ఈ పోటీల్లో కీసర మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల కళాశాల ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థిని మౌనిక కాంస్యం సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాములు విద్యార్థినిని అభినందించారు.

రైతుల ఖాతాల్లోకి నిధులు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో 24,978 మంది రైతుల ఖాతాల్లో రూ.23.49 కోట్లు బుధవారం వరకు రైతు భరోసా పథకం కింద జమ అయినట్లు జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. వర్షాకాలం పంట పెట్టుబడి సాయానికి రైతు భరోసా నిధులు అన్నదాతకు ఎంతగానో ఉపయోగపడగలవని ఆయన పేర్కొన్నారు.

క్రీడా పాఠశాలల్లో పూర్తయిన జిల్లా స్థాయి ఎంపికలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని మండల స్థాయి క్రీడా పోటీల్లో ఎంపికైన బాలబాలికలకు బుధవారం జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో 55 విద్యార్థులు పాల్గొన్నారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్టర్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, మెడిసన్ బాల్ త్రో, 800 మీటర్స్ పరుగు, వర్టికల్ జంప్, షటిల్ పరుగు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు వచ్చేనెల 3 ,4 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పాల్గొంటారని జిల్లా యువజన క్రీడల అధికారి గోపాల్‌రావు తెలిపారు.

కులవృత్తి ఉత్పత్తులను ప్రోత్సహించండి

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్రం అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లాలోని అంబేద్కర్ విగ్రహం , ఐమాక్స్ పక్కన ఉన్న ఓపెన్ గ్రౌండ్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన బీసీ వృత్తి కళాకారులు తయారు చేసిన వివిధ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఝాన్సీరాణి తెలిపారు. ఈనెల 29 వరకు కొనసాగనున్న వివిధ ఉత్పత్తులను కొనుగోలు చేసి తద్వారా వృత్తి కళాకారులను ప్రోత్సహించాలని ఆమె కోరారు.

అవినీతి తిమింగలాలు !

గ్రేటర్‌తో సహా శివారు పట్టణాల్లో అక్రమ నిర్మాణాలు

- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- మున్సిపల్ సర్కిళ్లు, పురపాలికల్లో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ సహా శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లు, పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో అక్రమనిర్మాణాలు, లే అవుట్లకు సంబంధించి అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై ఆయా అధికార యంత్రాంగం చర్యలకు సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో నగర, పట్టణాల్లోని సంబంధిత ఉద్యోగుల్లో వణుకు మొదలైంది. అవినీతి, అక్రమాలపై అధికార యంత్రాంగం తీవ్రంగా స్పందించినప్పటికీ, లోతైన విచారణ నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటే తప్పా.. అవినీతి, అక్రమాలను అరికట్టలేమని ప్రజాసంఘాలు, కాలనీల అసోసియేషన్లు పేర్కొంటున్నాయి. ఈ అవినీతి, అక్రమాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురి పెద్ద నేతల ప్రమేయం ఉందని ప్రజలు బాహాటంగానే ఆరోపిస్తున్నారు.

పర్సంటేజీల రూపంలో

పురపాలక సంఘాలు, పంచాయతీల పరిధిలో వెంచర్లు, లే అవుట్లు, ఇండిపెండెట్ ఇళ్లు, అపార్టుమెంట్లు నిర్మిస్తున్న వారి నుంచి అడ్డగోలుగా పలువురు రాజకీయ నాయకులు, ఉద్యోగులు అక్రమంగా వసూలు చేస్తున్నా.. వాటిని పర్సంటేజీల రూపంలో వార్డు/డివిజన్ సభ్యులు, టౌన్‌ప్లానింగ్, ఎంపీఓల నుంచి మొదలుకుని పురపాలక, పంచాయతీశాఖకు సంబంధిత అధికారుల వరకు వెళ్తున్నట్లు ఆ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

భారీగా వసూళ్లు

గ్రేటర్‌తో సహా మహానగరానికి కూత వేటు దూరంలోని మేడ్చల్ -మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని పురపాలక సంఘాలు, పంచాయతీల్లో భూములు, స్థలాలు, ఇళ్ల ధరలకు రెక్కలొచ్చాయి. ఇదే అదునుగా భావిస్తున్న పలువురు ఉద్యోగులు భారీ వసూళ్లకు తెరలేపినట్లు తెలుస్తోంది.



దమ్మాయిగూడలో నిర్మిస్తున్న షెడ్లు

- లే అవుట్లు, ఇండిపెండెంట్ ఇళ్లు నిర్మిస్తున్న వారి నుంచి ఏరియాను బట్టి ఎకరానికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల చొప్పున లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. భారీగా వసూలు చేసిన సొమ్ముల్లో నుంచి 40 శాతం నుంచి 60 శాతం చొప్పున పంపకాలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండిపడుతోంది.
- దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని గోధుమకుంట ఎర్రమెల్లి వాగు బఫర్‌జోన్ పరిధిలో అక్రమంగా ఫాంహౌజ్‌తో పాటు ఫంక్షన్‌హాల్ నిర్మిస్తున్నారు. బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలు చేపట్టకుండా కఠినంగా వ్యవహరించాలని స్పష్టమైన ఆదేశాలున్నా.. పట్టించుకునే వారే లేరు. ఎర్రమెల్లి వాగు బఫర్ పరిధిలో అక్రమ నిర్మాణాలు కొనసాగున్నాయని, 4 నెలల క్రితం ఇరిగేషన్‌శాఖ గుర్తించినప్పటికీ ఫలితం లేకుండా పోతోంది.
- ముత్వెల్లిగూడలో రహదారిని 9 అడుగులు ఆక్రమించి సెల్లార్‌తో పాటు భవన నిర్మాణం జరుగుతుందని స్థానికులు ఫిర్యాదు చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదు. అదే ప్రాంతంలో మర 4 భవనాలు తూర్పు వైపున 10 అడుగుల వరకు రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదు చేశారు.



నాగారంలో..

- అన్నోజిగూడలోని సర్వేనెంబర్ 14లో రెండెకరాలకు పైగా ఉండాల్సిన ప్రభుత్వ భూమిలో కొందరు రియల్టర్లు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి విక్రయిస్తున్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలిస్తేనే..

గ్రేటర్ సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల్లోనే ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు లక్షల్లో వచ్చాయి. ఒక్క మేడ్చల్ జిల్లాలో నమోదైన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 1.43 లక్షలను పరిశీలిస్తేనే.. అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ కట్టడాలు ఎన్ని ఉన్నాయన్న విషయం విధితమవుతుంది. ఈ అక్రమ కట్టడాలపై సంబంధిత జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

- చౌదరిగూడలోని విజయపురికాలనీలో ఒకేచోట 3 భవనాలను అనుమతులకు మించి అదనపు అంతస్తులతో చేపట్టిన నిర్మాణాలపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.
- నేచర్ క్యూర్ ఆసుపత్రి సమీపంలో టైల్స్ ల్యాబ్ పక్కన, సురభి హోటల్ వెనక అదనపు అంతస్తులతో భారీ భవనాలు నిర్మిస్తున్నారు. ఈ 3 భవనాల అదనపు అంతస్తుల స్లాబు వేయకుండా మున్సిపల్ అధికారులు నిలిపేశారు.
- వెంకటాద్రి టౌన్‌షిప్ వద్ద సర్వేనెంబర్ 867/2లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా 2 భవనాలు నిర్మిస్తున్నారని ఫిర్యాదు చేసినా.. చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు.
- జవహర్‌నగర్‌లో ప్రతిరోజు ఏదో ఒక డివిజన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతూనే ఉన్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు.
- బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట, బడంగ్‌పేట, మీర్‌పేట్, శంషాబాద్ తదితర శివారు పురపాలక సంఘాలతో పాటు ఉప్పల్, కుత్బుల్లాపూర్, కాప్రా తదితర మున్సిపల్ సర్కిళ్లలో కూడా అక్రమ భవన నిర్మాణాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎటు చూసినా బహుళ అంతస్తుల జోరు కనిపిస్తోంది. చిన్న వీధుల్లో కూడా 3,4 అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ, చెరువు శిఖం భూముల్లో కూడా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

గురుకులంలో తాత్కాలిక బోధనకు దరఖాస్తు

ఘట్‌కేసర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉప్పల్ కళాశాలలో ఐఐటీ, జేఈఈ బోధించడానికి నిష్ణాతులైన బోధకుల నుంచి తాత్కాలిక పద్ధతిలో పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల జోనల్ అధికారి నిర్మల, డీసీఓబీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధించే వారు గౌలిదొడ్డి హైదరాబాద్‌లో రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూ నిర్వహిస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలతో హాజరుకావాలన్నారు. ఎంపికైన వారికి వారి అనుభవం ఆధారంగా గంటకు రూ. 650లు గౌరవ వేతనం అందజేస్తామని చెప్పారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



డీఈ విజయలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మేడ్చల్: పట్టణ పరిధిలోని 3వ వార్డులోని రాఘవేంద్రనగర్ కాలనీలో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు వాపోయారు. తమ కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని డీఈ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. వారం రోజులుగా నల్లాలో నీరు సరిగ్గా రావడం లేదని నీటి సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని కాలనీవాసులు వాపోయారు. తమ కాలనీలో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని డీఈని కోరారు. మధుకర్, నిషిత్‌రెడ్డి, మురళీగౌడ్, రాంప్రసాద్ తదితరులున్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో కమిషనర్ వసంత ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికీ ఇళ్లు అందజేస్తామని, దేశంలోనే రాష్ట్రం అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. మాజీ మేయర్ శాంతికోటేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడిపై కేసు

ఘట్‌కేసర్: స్థానిక బీజేపీ నేతపై ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాజీ ఎంపీపీ అవుషాపూర్‌కు చెందిన సుదర్శన్‌రెడ్డి 2023లో గ్రామంలోని తన భవనాన్ని ఉప్పల్‌కు చెందిన నల్లా అనిరెడ్డి దగ్గర రూ. 1 కోటి 25 లక్షలు చేబదులు తీసుకుని (జీపీఏ) ద్వారా అమ్మకం ఒప్పందంతో విక్రయించాడు. అనంతరం భవనాన్ని ఆమెకు అప్పగించకుండా కళాశాలకు అద్దెకు ఇచ్చాడు. కళాశాల ఇన్‌చార్జ్ హరికృష్ణ అక్రమంగా భవనంలోకి ప్రవేశించడంతో బాధితురాలు ఇరువురిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు ట్రెస్ పాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎదుగుదలను చూసి ఓర్వలేకే ఆరోపణలు..

కుదవ పెట్టిన భవనాన్ని మార్కెట్ ధరకు విక్రయిస్తానని చెబితే సగం ధరకు తమకే విక్రయించాలని ఆమె ఒత్తిడి చేస్తుందని, మాజీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. తీసుకున్న అప్పుకు వడ్డీ చెల్లిస్తున్నానని, ఆమెకు భవనాన్ని విక్రయించలేదని, జీపీఏ ద్వారా మార్టిగేజ్ చేశానని, నా ఎదుగుదలను చూసి ఓర్వలేక ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

నేడు వినాయకచవితి ఉత్సవాలపై సమావేశం

కీసర: నాగారం మున్సిపాలిటీలోని స్టార్ ఫంక్షన్‌హాల్‌లో వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నేడు గురువారం ఉదయం 10.30కు సమావేశం నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి మున్సిపల్ పరిధిలోని వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు, యువజన సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు హాజరుకావాలని కోరారు.

కిష్టాపూర్ స్కూల్ సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యా కమిషన్ సభ్యురాలు

మేడ్చల్: రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న శివారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల, సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం సందర్శించారు. బోధన తీరు, పాఠ్యాంశాల అర్థమవుతున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటశాలలను పరిశీలించి వంట నాణ్యతపై ఆరా తీశారు. నవీన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, ఎంఈఓ శంకర్, ప్రిన్సిపాల్ లలిత తదితరులున్నారు.

కేంద్రం లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలి



సమ్మె నోటీసులు అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కీసర: జూలై 9న దేశవ్యాప్త సమ్మె సందర్భంగా సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం దమ్మాయిగూడ మున్సిపల్ మేనేజర్ వెంకటేష్, నాగారం మున్సిపాలిటీ మేనేజర్ సురేష్‌రెడ్డిలకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు బంగారు నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. కేంద్రం కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. కేంద్రం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఉపాధి, ఉద్యోగ, పనిభద్రత కల్పించాలని, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలన్నారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, ప్రజలు, తదితరులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు యాదన్న, నాగారం మున్సిపాలిటీ నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కీసర: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని మరోసారి నిరూపించబడిందని కీసర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోల కృష్ణయాదవ్ అన్నారు. బుధవారం కీసర చౌరస్తాలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు రైతు పథకం కింద ఆర్థికసాయం అందించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70 లక్షల మంది రైతులకు రైతుభరోసా పథకం కింద ఆర్థికసాయాన్ని రూ.9 వేల కోట్ల పైచిలుకు నిధులను చెల్లించిందన్నారు. భవిష్యత్తులో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రామిడి విజయ్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రమేష్‌గుప్తా, లక్ష్మణ్, దయానంద్‌గౌడ్, రవీందర్, ధర్మేందర్, కృష్ణారెడ్డి, మల్లేష్, జయేంద్రరెడ్డి, అరుంధతి, వెంకటేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందెంలో కలిసి.. దొంగతనాలకు ప్రణాళిక చేసి


సెంట్రింగ్ బాక్స్ ఎత్తుకెళ్తున్న నిందితుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: కోడి పందెంలో కలుసుకున్న ముగ్గురు తమ అవసరాలు తీర్చుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో సులువుగా డబ్బులు సంపాదించాలనే దురాశతో దొంగతనాలకు పాల్పడి చివరకు కటకటాలపాలయ్యారు. పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో సెంట్రింగ్ బాక్సుల చోరీల కేసును మేడ్చల్ పోలీసులు ఛేదించారు. బుధవారం మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ శంకర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రావులపాలెంకు చెందిన నరేష్ (32) కొంపల్లిలో నివాసం ఉంటూ.. సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతనికి దేవరయాంజాల్ పరిధిలోని సేవాలాల్ తండాకు చెందిన బానావత్ నరేష్(27) జీడిమెట్లకు చెందిన కురాకుల లోవరాజు(30) తో సంక్రాంతి సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమలాపురంలో నిర్వహించే కోళ్ల పందాల్లో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా.. స్నేహంగా మారడం ముగ్గురు కలిసి మద్యం సేవించేవారు. సెంట్రింగ్ పనిచేసే నరేష్ సెంట్రింగ్ బాక్సులు దొంగిలించి వాటిని అమ్మి సులువుగా సొమ్ము చేసుకోవచ్చని భావించి మేడ్చల్, శామీర్‌పేట్, జీనోమ్‌వ్యాలీ, పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వెంచర్లు, భవన నిర్మాణాల వద్ద సెంట్రింగ్ బాక్సులు దొంగిలించి వాటిని నగరంలోని భోలక్‌పూర్‌లో స్క్రాప్ నిర్వహించే మహ్మద్ ఇస్మాయిల్(34)కు విక్రయించారు. 5 చోరీ కేసుల్లో నిందితులైన వీరిని మేడ్చల్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2 లక్షల విలువైన సెంట్రింగ్ బాక్సులు, రెండు టాటాఏస్ వాహనాలు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు



పనులను ప్రారంభిస్తున్న డీఈ సంతోష్‌కుమార్

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి అయ్యప్పనగర్‌కాలనీలో రూ.15 లక్షలతో చేపట్టనున్న అంతర్గత డ్రైనేజీ పనులను బుధవారం మున్సిపల్ డీఈ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగారం మున్సిపల్ కమిషనర్ ఆదేశానుసారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ పరిధిలో గుర్తించిన ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించేందుకు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. గండి అంజయ్యగౌడ్, భూమయ్యయాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఏళ్లుగా ఖాళీలు !

నగర శివారు పురపాలికల్లో భర్తీ చేయని పారిశుద్ధ్య కార్మికుల పోస్టులు

- ఉన్న ఉద్యోగులపైన అదనపు భారంతో పడకేస్తున్న పారిశుద్ధ్యం
- రోడ్ల పక్కనే పేరుకుపోతున్న చెత్తా,చెదారం
- తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలు, పట్టించుకోని అధికారులు

పురపాలికల్లో ఏళ్లుగా భర్తీ కానీ పోస్టులతో శాశ్వత పారిశుద్ధ్య కార్మికుల కొరత తీవ్రంగా కనిపిస్తోంది. డ్రైనేజీలు శుభ్రం చేసే కామాటీలు, రహదారులు, వీధులు శుభ్రం చేసే స్వీపర్లు సరిపడా లేకపోవడంతో పట్టణాల్లో స్వచ్ఛత గాడి తప్పుతుంది. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని 16 పురపాలికల్లో దాదాపు ఇదే పరిస్థితి ఉంది. ఏళ్లుగా పారిశుద్ధ్య విభాగాల్లో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయకపోవడంతో ఉన్న కార్మికులపైనే అదనపు భారం పడుతోంది.
– సాక్షి,సిటీబ్యూరో

10 వేల జనాభాకు

పురపాలకశాఖ పరిపాలనా విభాగం నిబంధనల ప్రకారం ప్రతి 10 వేల జనాభాకు 28 మంది రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాల్సి ఉన్నప్పటికీ.. అమలు కావడం లేదు. జిల్లాలోని బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట నగరపాలక సంస్థలు, కొంపెల్లి, దుండిగల్, మేడ్చల్, నాగారం, తూంకుంట, గుండ్లపోచంపల్లి, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 4,24,299 జనాభా ఉండగా.. ప్రస్తుతం సుమారు 10 లక్షలకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

28 పంచాయతీలు విలీనం

ఘట్‌కేసర్, తూంకుంట, పోచారం, దమ్మాయిగూడ, నాగారం తదితర 7 పురపాలక సంఘాల పరిధిలోకి 28 పంచాయతీలు విలీనం కాగా.. మరో 34 గ్రామపంచాయతీలను కలుపుతూ.. అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ మున్సిపాలిటీల్లో కూడా పారిశుద్ధ్య కార్మికులు అవుట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్నారు. పెరుగుతున్న జనాభా, కాలనీలకు అనుగుణంగా పురపాలక సంఘాల్లో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాల్సి ఉన్నప్పటికీ.. పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న వారిపైనే అధికభారం పడుతోంది.

ప్యానల్ పోస్టులకే

పురపాలికల్లో కమిషనర్లు, ఇంజినీర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, మేనేజర్లు, అకౌంటెంట్లు, ఆర్ఐలు, క్లర్కులు, బిల్ కలెక్టర్లు వంటి ప్యానల్ పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్న ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల విషయాన్ని మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలున్నాయి. గతంలో టీఎస్‌పీఎస్సీ ద్వారా జిల్లాలోని పురపాలికల్లో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ విభాగాల్లో ప్యానల్ పోస్టులు భర్తీ అయ్యాయి. అయితే పారిశుద్ధ్య కార్మికుల పోస్టులు మాత్రం ఖాళీగానే ఉంటున్నాయి.

పెరిగిన జనాభా

నగర శివారు 13 పురపాలికల్లో గణనీయంగా జనాభా పెరుగుతుండటంతో సుమారు 10 లక్షల జనాభా దాటింది. ఈ లెక్క ప్రకారం శివారు పురపాలక సంఘాల్లో 2,840 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాల్సి ఉంటుంది. 13 పురపాలక సంఘాల్లో ప్రస్తుతం రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అవుట్ సోర్సింగ్ సేవల కింద నియమించిన కార్మికులతోనే పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు.



లోప భూయిష్టంగా చెత్తసేకరణ

నగర శివారు పురపాలికల్లో తడి, పొడి చెత్త సేకరణ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రతిరోజూ చెత్తను వేరుచేసి సేకరించాల్సి ఉన్నా.. సరిపడా సిబ్బంది లేక ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. దీనికి నిర్లక్ష్యం కూడా ఉందని ఆరోపిస్తున్నారు. జిల్లాల్లో మొత్తంగా 16 పురపాలక సంఘాలు ఉండగా.. లక్షకు పైగా జనాభా కలిగిన పురపాలికల్లో ప్రతిరోజూ దాదాపు 65 టన్నులు, లక్ష లోపు జనాభా ఉన్న పురపాలికల్లో 40 టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. సంబంధిత అధికారులు మాత్రం చెత్త వాహనాలకు మైకులు పెట్టుకుని తడి, పొడి చెత్తను వేరుచేసి అందజేయాలని ప్రచారం చేస్తున్నా.. ఆచరణలో అమలు నోచుకోవడం లేదు. కొన్ని వార్డుల్లో 2-3 రోజులకోసారి చెత్త తరలించే వాహనం రావడంతో అప్పటి వరకు ఇళ్లలోనే నిల్వ ఉంటోంది. చేసేదేమీలేక కాలనీలో రోడ్ల వెంబడి పారబోస్తున్నారు. దీంతో దుర్వాసన, దోమల బాధను భరించలేకపోతున్నామని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.